జగనన్న వల్లే పిల్లల చదువులు



పాలకొండ రూరల్: పెద్దకాపువీధి ప్రభుత్వ పాఠశాలలో చదువుల్లో నిమగ్నమైన విద్యార్థులు

- నియోజకవర్గంలో 31,421 మంది విద్యార్థులకు యూనిఫారాలు, బూట్లు, పుస్తకాల పంపిణీ
- కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

2023 - 24 విద్యా సంవత్సరంలో విద్యా కానుక వివరాలు ఇలా...

మండలం	స్కూల్స్	యూనిఫారాలు	బూట్లు	బ్యాగ్స్	బెల్ట్స్	పాఠ్య పుస్తకాలు
కురుపాం	174	7664	7664	7664	6089	38044
కొమరాడ	127	5916	5916	5916	4315	30946
జి.ఎల్.పురం	170	9240	9240	9240	7025	44562
గరుగుబిల్లి	57	4024	4024	4024	2649	24060
జి.ఎం.వలస	95	4577	4577	4577	3425	24192
మొత్తం	623	31421	31421	31421	23505	161804

కురుపాం: పేద పిల్లలు కార్పొరేట్ విద్యనభ్యసించాలనే సదుద్దేశంతో రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను సమూలంగా మార్పు చేసింది. నాడు – నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్పు చేసింది. పాఠశాలలకు సకల సదుపాయాలను కల్పించింది. విద్యార్థిని బడికి పంపితే చాలు...అన్నీ తానై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పిల్లల చదువు బాధ్యతను తీసుకుంది. విద్యకు కావాల్సిన పుస్తకం నుంచి యూనిఫారాల వరకు అన్నీ సమకూర్చింది. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తోంది. కురుపాం నియోజకవర్గంలో 623 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 31,421 మంది విద్యార్థులకు 2023 –24 విద్యా సంవత్సరానికి సంబంధించి లక్షా 61 వేల 804 నోటు పుస్తకాలను పంపిణీ చేసింది. అలాగే యూనిఫారాలు, బ్యాగులు, బెల్టులు, నోటు పుస్తకాలు కూడా అందజేసింది. పేదల విద్య కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం ద్వారా పిల్లలంతా కార్పొరేట్ విద్యకు ధీటుగా ఎదుగుతున్నారు. దీన్ని చూసి తల్లిదండ్రులుసంబరపడుతున్నారు. తమపిల్లల ఆంగ్లచదువులు చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

నిరుపేదలకు మెరుగైన విద్య



నా కుమారుడు బడ్డి సురేష్ చిన్నమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే జగనన్న విద్యా కానుక ద్వారా సరఫరా చేస్తుంది. ఈ ఏడాది కూడా జేవీకే కిట్స్‌ను అందించింది. నిరుపేదలకు మెరుగైన విద్య, సౌకర్యాలను అందించటం ఎంతో సంతోషంగా ఉంది. – బడ్డి రవణమ్మ, అల్లువాడ, జియ్యమ్మవలస మండలం



మాది మధ్యతరగతి కుటుంబం. నాకు ముగ్గురు పిల్లలు. నా భర్త మృతితో పిల్లల బాధ్యత నాపై పడింది. కుటుంబ పోషణ కోసం వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాను. ప్రైవేటు బడుల్లో పిల్లలను చదివించే స్తోమత లేదు. ఈ క్రమంలో జగనన్న అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే అమాంతం మారిపోయాయి. విద్యార్థికి కావాల్సిన సకల సదుపాయాలు కల్పించారు. దీంతో నా పిల్లలను కాపు వీధిలో గల ప్రభుత్వ బడిలో వేశాను. పెద్దమ్మాయి జ్యోత్స్న పదో తరగతి, తరుణ్ ఆరు, చిన్నోడు వరుణ్‌తేజ్ మూడో తరగతి చదువుతున్నారు. పిల్లలకు కావాల్సిన పుస్తకాలతో అన్నీ ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. అమ్మ ఒడి ఇస్తున్నారు. అసలు నా పిల్లల బాధ్యత జగనన్నే మోస్తున్నారు. దీంతో ఎంతో ధైర్యం వచ్చింది.
– జంపా లక్ష్మి, పాలకొండ

విద్యార్థులకు ఒక వరం



నాకు ఇద్దరు కుమార్తెలు. మరడ దీపిక 8వ తరగతి, మరడ దీపన 7వ తరగతి స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్నారు. నా ఇద్దరు పిల్లలకు జగనన్న విద్యా కానుకలో భాగంగా ప్రతీ ఏడాది యూనిఫారాలు, బూట్లు, బెల్ట్స్, నోట్ బుక్స్, అన్ని విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే సరఫరా చేస్తున్నారు. ప్రైవేటు విద్యకు ధీటుగా విద్య బోధన కూడా అందిస్తున్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి వంటివి మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.
– మరడ జానకి, రాజ్యలక్ష్మీపురం, కొమరాడ మండలం



ప్రజా పాలన జగనన్నతోనే సాధ్యం



శృంగరాయపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి
- జన.. నీరాజనం

వీరఘట్టం: రాష్ట్రంలో సంక్షేమం పథకాలు పార్టీలకతీతంగా అందాలన్నా.. అభివృద్ధి పరుగులు తీయాలన్నా... మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మన భవితవ్యం మన చేతుల్లోనే ఉందని మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు మరోసారి ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మండలంలోని శృంగరాయపురం, పాపంపేట, అడారు, డెప్పివలస, చేబియ్యంవలస గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార ర్యాలీల్లో ఆమె మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల వారికి సామాజిక భద్రత, భరోసా, సంక్షేమానికి, స్వావలంబనకు పెద్దపీట, సమ సమాజ స్థాపన అన్ని వర్గాల ప్రజల సుఖసంతోషాలే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కళావతి అన్నారు. ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూడలేక టీడీపీ జిత్తులమారి పొత్తులో ప్రజలను మాయమాటలతో మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత టీడీపీ అరాచక పాలనతో రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనమైందని ఎమ్మెల్యే కళావతి ధ్వజమెత్తారు.

హోరెత్తిన ప్రచారం...

ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వస్తున్నారని తెలియడంతో శృంగరాయపురం, పాపంపేట, అడారు గ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెలే కళావతికి మహిళలు హారతులు ఇస్తూ నీరాజనాలు పలికారు. మహిళలు, యువకులు ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. రావాలి జగన్ – కావాలి జగన్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఎంపీటీసీ విశ్వాసరాయి భార్గవ్, సర్పంచ్‌లు మిడితాన కళ్యాణి, నీలం సుధారాణి, నీలం సత్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు వైశ్యరాజు గోవిందరాజు, వావిలపల్లి హరిబాబు, జంపు శేఖర్, సొంట్యాన సింహాచలం, బర్ల దుర్గారావు, వారాడ శ్రీరాములనాయుడు, పొట్నూరు పరిసినాయుడు పాల్గొన్నారు.

నేడు పుష్పశ్రీవాణి ఎన్నికల ప్రచారం

కురుపాం: మండలంలోని పి.లేవిడి, గుమ్మ, ఏగులవాడ పంచాయతీల్లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం ప్రచారం చేయనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకర్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు పి.లేవిడి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తారం, 10 గంటలకు కొండలేవిడి, 10.30కి కోనగూడ, 11 గంటలకు కుంబిమానుగూడ, 11.30 గంటలకు గుమ్మగదబవలస, 12.30 గంటలకు గుమ్మలో ప్రచారం చేస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జొంగరపాడులో భోజన విరామం అనంతరం రజ్జిలి, సీడుమానుగూడ, ఏగులవాడ గ్రామాల్లో ఇంటింట ప్రచారం చేస్తారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

శిక్షణకు అవసరమైన వసతులు

భామిని: మండలంలోని ఘనసర కాలనీలో కొత్తగా నిర్మించిన ఉచిత ట్యూషన్ సెంటర్, టైలరింగ్ ట్రెనింగ్ సెంటర్ భవనాలను గ్రామీణ వికాస సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ రమణమూర్తి ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో వీటిని నిర్మించారు. శిక్షణ కేంద్రంలో భవనాలతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర వసతులు ఏర్పాటు చేశారు. గ్రామీణ వికాస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ, విద్యా బోధనలపై ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రభుత్వ టీచర్లు, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామీణ వికాస సంఘం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

నేడు కళావతి ప్రచారం

సీతంపేట: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రచారం చేయనున్నారు. దేవనాపురం, కొత్తగూడ, పెదరామ, పెద్దూరు, పాతపనుకువలస గ్రామ పంచాయతీల పరిధిలో ప్రచారం చేయనున్నారని మండల కన్వీనర్ జి.సుమిత్రారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చల్లబడ్డ వాతావరణం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి విపరీతమైన ఎండతో పాటు వేడిగాలులు వీయడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై, ఉరుములతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

గ్రంథాలయంలో 'మాకిష్టం'

గరుగుబిల్లి: విద్యార్థులకు చదువు, క్రీడల్లో ఆసక్తిని పెంచేందుకు చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని స్థానిక శాఖ గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కేరం, చదరంగం తదితర ఆటలను నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని వత్తాడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీను, వైస్ సర్పంచ్ పాలక మహేష్, తాడంగి శ్రీనుతో పాటు యువత, గ్రామ పెద్దలు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సమక్షంలో చినమేరంగిలోని తన స్వగృహంలో ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న పాలనలో జరిగిన సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిన కృషిని మెచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దీనమయ్య, వైస్ సర్పంచ్ శేఖర్, నాయకులు మురళి, నాగు ప్రేమానంద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గిరిజన గురుకుల ప్రవేశ పరీక్ష

సీతంపేట: గిరిజన గురుకులాల్లో ఐదో తరగతిలో మొత్తం సీట్లు, 6 నుంచి 9 తరగతులకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక బాలుర, బాలికల గిరిజన గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష జరిపారు. మొత్తం 403 మంది హాజరయ్యారు.

469 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 66 మంది గైర్హాజరయ్యారు. గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్లు తిరుపతిరాజు, అరుణ్‌జ్యోతి పర్యవేక్షించారు.

నిశితంగా పరిశీలించాలి

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతున్న సిబ్బంది లోతుగా పరిశీలించాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి సిబ్బందిని ఆదేశించారు. పాలకొండ- విశాఖ రహదారిలో చినమంగళాపురం కూడలిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా శనివారం సందర్శించారు. ఈ క్రమంలో అక్కడి రికార్డులు, నమోదైన కేసులు, పట్టుబడిన నగదు వివరాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారుల పట్ల గౌరవంగా మెలగాలని, అనుమానిత కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తీసుకు వచ్చే నగదు, మద్యం, ఇతర నిషేధిత పదార్థాల తరలింపు జరగకుండా చూడాలన్నారు. ఎండల తీవ్రతలను అలసత్వం చేయకుండా, తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రి సమయంలో తనిఖీలు చేపడుతున్న సిబ్బంది విధిగా రేడియం జాకెట్లు ధరించాలన్నారు.



విశాఖ రహదారిలో మంగళాపురం వద్ద చెక్‌పోస్టులో రికార్డులు చూస్తున్న సీఐ

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ స్కూల్‌లో ప్రవేశాల నిమిత్తం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు 5వ తరగతిలో ప్రవేశ పరీక్షకు 114 మంది రాయాల్సి ఉండగా 94 మంది హాజరయ్యారని, 6వ తరగతికి 252 మంది రాయాల్సి ఉండగా 189 మంది, 7వ తరగతిలో ప్రవేశానికి 35 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 31 మంది, 8వ తరగతిలో ప్రవేశానికి 36 మంది రాయాల్సి ఉండగా 31 మంది, 9వ తరగతిలో ప్రవేశానికి 17 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 13 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు ప్రిన్సిపాళ్లు వరప్రసాద్, యుగంధర్‌లు తెలిపారు. ఈ పరీక్షను అబ్జర్వర్ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.



ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూఓ సురేష్ కుమార్

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమము పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టాంకు చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సర్దె నరశింహచార్యులు ఆధ్వర్యంలో హోమము పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బాబా ఆలయంలోని హోమములో పాల్గొన్న దంపతులు

జిల్లాలో వైద్య సేవలు విస్తరిస్తాం

- డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: జిల్లాలో వైద్య సేవలు విస్తరించాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు తెలిపారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీ పరిధి సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రతి గ్రామంలో వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది డీఎంహెచ్‌ఓను సన్మానించారు.



డీఎంహెచ్‌ఓను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

పట్టింపులకు పుట్టిళ్లు 'కళ్లికోట' గ్రామదేవత

కొమరాడ: పట్టింపులకు పుట్టిళ్లుగా పేరొందిన కళ్లికోట గ్రామదేవత పండగ పదేళ్ల తరువాత సోమవారం నుంచి జరగనుంది. మూడు రోజుల పాటు జరగనున్న పండగకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

గ్రామ దేవత విశిష్టత

దత్తి కుటుంబీకుల ఆడపిల్లగా కొలిచే గ్రామదేవత 'వేపారమ్మ' విశిష్టత ఎనలేనిది. గ్రామంలోని వారు ఎక్కడకు వెళ్లినా వేపారమ్మను తలచుకోకుండా వెళ్లరు. ఏ కొత్త వస్తువు కొనుగోలు చేసినా దానిపై మొదట గ్రామదేవత పేరు రాయిస్తారు. గ్రామంలో ఎవరైనా మంగళవారం పుడితే ఆడపిల్లకు వేపారమ్మ, మగ పిల్లాడికి వేపారనాయుడని పేరు పెడతారు. దీంతో నిత్యం ఆ తల్లిపేరును తాము తలుస్తుంటారు. తమ గ్రామం సుభిక్షంగా ఉండడానికి గ్రామదేవత రక్షణే కారణమని గ్రామస్తులు నమ్ముతారు.



పూజా మందిరంలో ఉన్న అమ్మవారి ఘటాలు



ఊరి పొలిమేరల్లో నిలిపేసిన వాహనాలు

పండగ ఇలా...

సోమవారం ఘటాల మందిరంలో అమ్మవారికి దత్తి కుటుంబీకులు పూజలు చేస్తారు. దీనిలో భాగంగా తాళింపు పప్పు, ఉప్పు లేని వంటకాలు అమ్మవారికి నైవేద్యంగా పెడతారు. మంగళవారం ఘటాల ఊరేగింపు, పెద రథం మానోత్సవం, అంజలి రథం తదితర ఉత్సవాలు జరుగుతాయని కమిటీ వారు తెలిపారు. మంగళవారం రాత్రి నుండి గ్రామంలో నాలుగు ఘటాలు, పాల జంగిడి ఊరేగింపుగా బుధవారం ఉదయానికి అమ్మవారి వనానికి తీసుకు వెళ్లి అక్కడ గంగాదేవి మేక, పట్టాభి గొర్రె పోతులతో మొక్కు తీరుస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

పండగ పట్టింపులు

పండగ చాటింపు తర్వాత గ్రామదేవతను వనం నుండి తెచ్చిన నాటి నుండి గ్రామంలో చెప్పులు, మోటారు వాహనాలు నిషేధం. గ్రామంలోకి ఎవరు వచ్చినా పొలిమేరల్లో చెప్పులు, వాహనాలను విడిచి గ్రామంలోకి రావాలి. ఒకవేళ ఎవరైనా అలా వస్తే వారికి వెంటనే ఏదో ఒక అపకారం జరుగుతుందని గ్రామస్తులు ప్రగాఢంగా నమ్ముతారు. దీంతో పాటు పండగన్ని రోజుల్లో తామంతా పడి మంచాలపై పడుకుంటారు. అంతే కాకుండా స్త్రీ, పురుషులు సరసాలకు దూరంగా ఉంటారు.

క్లుప్తంగా

తగాదాలకు తావివ్వొద్దు.. : ఏఎస్పీ



కళ్లికోటలో అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ సునీల్ షారోన్

కొమరాడ: మండలంలోని కళ్లికోట గ్రామంలో వేపారమ్మ తల్లి పండగ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి తగదాలకు తావివ్వొద్దని ఏఎస్పీ సునీల్ షారోన్ అన్నారు. కళ్లికోట గ్రామంలో పండగ నేపథ్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ పండగకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు చోటివ్వద్దని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. పార్వతీపురం సీఐ కె.రవికుమార్, స్థానిక ఎస్ఐ కె.నీలకంఠం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామ పంట పొలాల్లో మట్టి నమూనాల సేకరణ ఆదివారం చేపట్టారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మట్టి నమూనాల ఆధారంగా భూసార పరీక్షలు చేసి, నేలసారవంతమా కాదా అనే విషయం తెలుసుకోవచ్చన్నారు. అలాగే నేలసారం బట్టి, పంట వేసుకుని తద్వారా నాణ్యమైన పంట, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఏ నేలలో ఏ పంట వేస్తే మంచిదన్న విషయం తెలుస్తుందన్నారు. భూసార పరీక్షల ద్వారా ఎరువుల వినియోగం కూడా తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం యాంత్రీకరణ ఉపకరణాల వినియోగం, లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. తద్వారా సాగులో వ్యయం తగ్గించుకొని లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శరత్‌బాబు, సూర్యనారాయణ, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో మష్రూమ్ తయారీలో శిక్షణ పొందిన 35 మంది యువతీ, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్లు ఆదివారం అందజేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పర్యవేక్షణలో కలెక్టర్, నీతి అయోగ్ సంయుక్తంగా అనూష ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉపాధి పొందాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి గోవిందరావు, బొత్స గురువునాయుడు మెమోరియల్ సొసైటీ మేనేజర్ కె.రవికిరణ్, మండల కో–ఆర్డినేటర్ ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సింహాద్రప్పన్న సంబరాలు



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలంలోని గుచ్చిమిలో మూడు రోజులుగా నిర్వహించిన సింహాద్రప్పన్న సంబరాలు ఆదివారం ముగిశాయి. గ్రామానికి చెందిన బంకురు, బల్ల, పెద్దింటి, శెట్టి, నడిమింటి, పోల కుటుంబీకులు పూర్వీకుల నుంచి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు సింహాద్రప్పన్నకు పూజలు చేశారు. తప్పెటగుళ్లు, భజన పాటలతో స్వామివారిని కీర్తించారు. రాత్రి పూట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజున వేలాది మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 42 మంది ఎంపిక



రోగిని తనిఖీ చేస్తున్న వైద్యుడు

రాజాం: పట్టణ పరిధిలోని మెంతిపేటలో సత్యసాయి సేవా సమితి సుందరం మందిరం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సుందరం మందిరం, విశాఖ శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ శిబిరానికి హాజరైన 98 మంది కళ్లను వైద్య సిబ్బంది తనిఖీ చేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 42 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం ఆస్పత్రి కో–ఆర్డినేటర్ రాజు తెలిపారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సుందరం మందిరం కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.